సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 12-12-2024
సంపుటి: 20 సంచిక: 220
పేజీలు: 4 వెల: రూ.1



ట్రిపుల్ ఐటీ విద్యార్థి
## ఆత్మహత్య..!
- మూడో అంతస్తు నుంచి దూకిన ప్రవీణ్
- క్యాంపస్‌లో వెంటాడుతున్న విషాదాలు

- వివరాలు 4లో



## పద్మశ్రీ అవార్డుకు అవమానం

మోహన్‌బాబు మంచి నటుడే.. ఇది కాదనలేని సత్యం. కానీ మోహన్‌బాబులో ఉన్న అహంకారాన్ని ఎవరూ క్షమించలేనిది. ఈయనకు నోటిదురుసు ఎక్కువని అందరికీ తెలుసు. 'మనిషివా? మోహన్‌బాబువా?' అన్న నానుడి వాడుకలోకి వచ్చిందంటే మోహన్‌బాబు వ్యవహారశైలి ఏ స్థాయికి చేరిందో తెలుసుకోవచ్చు. పెదరాయుడు సినిమా షూటింగ్ సమయంలో సీనియర్ నటి జయంతిపై చేయి చేసుకున్న మోహన్‌బాబు.. ఆ తర్వాత నటి దీప మీద, అనేక మంది జూనియర్ ఆర్టిస్టులు మీద కూడా చేయి చేసుకున్నారు. తన కుటుంబ వ్యవహారాలు రోడ్డుకెక్కి రచ్చ అవుతున్న సమయంలో మీడియా వార్తాకథనాలు ఇవ్వాల్సి వచ్చింది. ఆ సమయంలో ఒక మీడియా ప్రతినిధిపై అత్యంత విచక్షణారహితంగా మోహన్‌బాబు దాడికి పూనుకోవటం హేయమైన చర్య. భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ అవార్డు, యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన వ్యక్తి ఎంత ఆవేశముంటేనేమి, కుటుంబ కలహాలు ఏ స్థాయిలో ఉంటేనేమి ఇలా బయటపడి రచ్చ చేసు కోవడం సభ్యసమాజానికి ఆయన ఇస్తున్న సందేశం ఏమిటో ఆయనకే తెలియాలి. ఆయన ఎక్కడ ఏ సందర్భంలో మాట్లాడినా అహంకారం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. ఒక వీధిరౌడీ వ్యవహరించిన తీరులో ఆయన వ్యవహరించారు. రాష్ట్రపతి, ప్రధానితో సహా దేశంలోని అత్యున్నత వ్యక్తుల సరసన నిల్చుని కుటుంబ సభ్యులంతా ఫోటోలకు ఫోజిచ్చి మా పొజిషన్ ఇది అని చెప్పుకున్నోడు చేసే పనేనా? దేశంలో ఏ విద్యాసంస్థ నడపనంత క్రమశిక్షణతో శ్రీ విద్యానికేతన్ నడుపుతున్నానని గొంతు చించుకునే మోహన్‌బాబు తన విద్యార్థులకు ఎలాంటి సందేశాన్ని ఇస్తున్నట్లో..? షిర్డీసాయినాథుడంటే ఎనలేని భక్తిని ప్రదర్శించే ఈ భక్తాగ్రేసరుడు, తిరుమల వెంకటేశ్వరుని సన్నిధిలో పుట్టానని పులకించిపోయే ఆరడుగు ఆవేశం, ఒక అయ్యప్ప భక్తునిపై చేసుకునే కుసంస్కారిగా మారిపోవడం ఏమిటో..? ఎన్టీఆర్, దాసరి నారాయణరావు లాంటి దిగ్గజాలనే కోలుకోలేని దెబ్బకొట్టిన ఈ మహా మోహన్‌కు ఎక్కడో ఓ చోట పర్ఫెక్ట్ బ్రేక్ పడాల్సిందే.. ఇప్పుడు టీవీ 9 విలేకరి రంజిత్ రూపంలో బ్రేక్ పడ్డట్లే. లేకపోతే ఇతని దూకుడుకు మరెన్ని వికృత దృష్టాంతాలను చూడాల్సి వస్తుందో..? రంజిత్‌పై పడ్డ దెబ్బ ఆయన ఒక్కడి మీద పడ్డట్లు కాదు.. మొత్తం జర్నలిస్ట్‌లపై పడ్డ దెబ్బగానే చూడాలి. మోహన్‌బాబుపై తీసుకునే చర్యలు కఠినంగా ఉన్నప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి. స్టేటస్ అనుభవించేటప్పుడు సెలబ్రిటీలం... వీధిన పడినప్పుడు మాత్రం ప్రైవేటు మనుషులమంటే కుదురుతుందా? శ్రీశ్రీ అన్నట్టు వ్యక్తుల ప్రైవేటు బతుకులు వారి సొంతం.. పబ్లిక్‌లో నిలబడితే ఏమైనా అంటాం. అక్షరాల్ని విరిచేసి, భావాన్ని నాశనం చేసి, అభాగ్య శ్రోతల, వీక్షకుల గుండెల్ని తూట్లుపడేలా మాట్లాడింది కేవలం మీ కూతురు కావడం వల్లనేగా! ఆమె మాటలు విన్న జనం అనుభవించిన క్షోభకు ధర కట్టగలిగినవారున్నారా ఈ ధరాతలంలో? మరిప్పుడు మా ఇంట్లో గొడవలు మీరెందుకు ప్రసారం చేస్తారంటూ టీవీ గొట్టాలను లాక్కొని వారినే కొడతామంటే ఎలా మోహన్ బాబు గారూ..? తప్పుకదూ!

## పర్యావరణం పాతమాట..
# ఇసుక తవ్వకాల్లో అందరికీ వాటా

- అనుమతులు లేని ర్యాంపు నుంచి రవాణా
- వైకాపా నాయకులదే పెద్ద వాటా
- స్టాక్‌పాయింట్ ఏర్పాటుచేసినా పట్టించుకోని యంత్రాంగం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

శ్రీకాకుళం రూరల్ మండలం బైరి గ్రామం వద్ద ఇసుక తవ్వకాలకు పర్యావరణ శాఖ అనుమతులు ఇచ్చేలోపు ఇక్కడ నదిలో ఇసుక మొత్తం ఖాళీ అయిపోయేటట్టు కనిపిస్తుంది. ఉచిత ఇసుక అన్నది కేవలం అనుమతులు పొందిన ర్యాంపు నుంచే కాని, అనుమతులు లేనిచోట కాదనే విషయం ఎవరికీ పట్టడంలేదు. బైరి ర్యాంపులో ఏ ఇసుకను తవ్వితే పర్యావరణానికి ముప్పు అని అనుమతులు ఇవ్వడానికి వెనుకాడుతున్నారో, ఇప్పుడు అదే ఇసుకను అనధికారికంగా తవ్వుకుపోతున్నారు. స్థానికంగా ఉన్న ట్రాక్టర్లతో ఇసుకను ఎత్తి దగ్గరలో ఉన్న ఓ చోట స్టాక్‌పాయింట్‌గా ఏర్పాటుచేసి, ఆ తర్వాత ఎంచక్కా విశాఖపట్నానికి అమ్మేస్తున్నారు.

బైరి వద్దే ఉన్న నీలిమ వేయింగ్ బ్రిడ్జి వద్ద స్టాక్‌ను ఏర్పాటుచేసి, అక్కడి నుంచి తరలిస్తున్నారు. వాస్తవానికి వేయింగ్ బ్రిడ్జిల వద్ద ఎటువంటి స్టాకు ఉండకూడదు. ఆ మాటకొస్తే అసలు ఈ వేయింగ్ బ్రిడ్జికి అనుమతులే లేవు. అయినా బ్రిడ్జి వద్దకు బరువు తూయడానికి వచ్చిన ఇసుక లారీలకు సంబంధించినదంటూ మధ్యపెట్టి ప్రొక్లెయినర్లతో లారీలకు లోడ్ చేస్తున్నారు. ఒడ్డుకు చేర్చిన ఇసుకను ట్రాక్టర్‌కు రూ.700, లారీకి రూ.9వేలకు విక్రయిస్తున్నారు. బైరిలో ఇసుక ర్యాంపునకు అనుమతులు ఇవ్వడానికి ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ లేదు. దీంతో ఇక్కడ అధికారికంగా ఇసుక ర్యాంపు ఏర్పాటుచేసి స్టాక్ పాయింట్ పెట్టాలని అధికారులు రెండు నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నా సాధ్యం కావడం - మిగతా 4లో



# 14 ఇసుక ట్రాక్టర్లు సీజ్

- ఆందోళనకు దిగిన యజమానులు
- బాబే తవ్వుకోమని చెప్పారని నిలదీత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉచిత ఇసుక విధానం అమలైన తర్వాత ఇసుకను గ్రామ సమీపంలోని నాగావళి నుంచి తరలించి స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి లారీలకు లోడ్ చేస్తున్న తమ్మినాయుడుపేట ట్రాక్టర్ యజమానులకు పోలీసు, రెవెన్యూ అధికారులు ఝలక్ ఇచ్చారు. తమ్మినాయుడుపేట నుంచి ఇసుకను తలిస్తున్న 14 ట్రాక్టర్లను నగరం సమీపంలో జాతీయ రహదారిపై ఎచ్చెర్ల పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గురువారం సీజ్ చేశారు. నాగావళి నుంచి ట్రాక్టర్లతో ఇసుకను తరలించి హైవే సమీపంలో డంప్ చేస్తూ విశాఖకు లారీల్లో అక్రమంగా ఎగుమతి చేస్తున్నారు. గత రెండు నెలలుగా ఇసుకను తోడేస్తూ సమీప ప్రాంతాల ప్రజల అవసరాలకు ఇసుక ఇవ్వకుండా అడ్డుకుంటున్న తమ్మినాయుడుపేట ఇసుక మాఫియాపై సీఎం కార్యాలయానికి స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం కదిలింది. ట్రాక్టర్లతో ఇసుక తరలించుకోవచ్చంటూ సీఎం చంద్రబాబు ప్రకటించారని రెవిన్యూ అధికారులు, పోలీసులతో ట్రాక్టర్ల యజమానులు వాగ్వాదానికి దిగారు. ట్రాక్టర్లను అడ్డుకొని ప్రభుత్వ సూచనలను పోలీసులు, రెవెన్యూ అధికారులు ధిక్కరించారని అక్రమంగా ఇసుకను తరలిస్తున్నవారు ఆందోళనకు దిగారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది చర్యలకు అడ్డుతగులుతూ ఆందోళన చేస్తామని జాతీయ రహదారిపై నిలదీశారు.

ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేట వద్ద ఉచిత ఇసుక అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇసుకను అక్రమంగా స్టాక్ వేసి అక్కడి నుంచి లారీలకు యంత్రాలతో లోడ్ చేసి విశాఖకు తరలించడం నిరంతర ప్రక్రియగా మారిపోయింది. ఇక్కడ ఇసుక ర్యాంపు లేదని మైన్స్ అధికారులు చెబుతున్నారు. ఉచిత ఇసుక అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామంలో కొత్తగా 40 ట్రాక్టర్లను స్థానికులు కొనుగోలు చేశారని తెలిసింది. నదిలో ఇసుకను ట్రాక్టర్లకు లోడ్ చేయడానికి ఒక జేసీబీని కొనుగోలు చేశారు. వీరంతా కలిసి గ్రామ సమీపంలో



నాగావళి నదిలో తమ్మినాయుడుపేట వద్ద ఇసుక ర్యాంపును తెరిచి సింగూరు తోటల్లో స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేసి జేసీబీలతో లారీల్లో లోడ్ చేసి విశాఖకు ట్రాన్స్‌పోర్టు చేస్తున్నారు. తమ్మినాయుడుపేటకు చెందిన ట్రాక్టర్ల యజమానులంతా కలిసి సమీప గ్రామాల నుంచి వచ్చే ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేసేందుకు నిరాకరిస్తూ అడ్డుకుంటున్నారని ట్రాక్టర్ల యజమానులు ఆందోళన చేశారు. వారి ట్రాక్టర్లను తమ్మినాయుడుపేట నుంచి నగరం మీదుగా వచ్చే క్రమంలో అడ్డుకోవడానికి ఫరీద్‌పేట, ఇబ్రహీంబాద్, కుశాలపురం గ్రామాలకు చెందినవారంతా సిద్ధమయ్యారు. తమ్మినాయుడుపేట గ్రామానికి చెందిన ట్రాక్టర్ల యజమానులంతా ఒక జట్టుగా ఏర్పడి స్టాక్‌పాయింట్ ఏర్పాటుచేసి రేయింబవళ్లు విశాఖకు లారీల్లో తరలిస్తున్నారు. దీనిపై రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోపోవడంతో సీఎంవోకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించి గురువారం మధ్యాహ్నం ఇసుక లోడ్ చేసుకొని నది నుంచి జాతీయ రహదారిపైకి వచ్చిన సమయంలో అడ్డుకొని సీజ్ చేశారు. నదిలో ఇసుకను లోడ్ చేయడానికి ఏర్పాటుచేసిన జేసీబీని సీజ్ చేస్తున్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఉచితంగా ఇసుక తరలించుకోవాలని ప్రభుత్వం చెబుతుంటే మీరెందుకు అడ్డుకుంటారని అధికారులను ట్రాక్టర్ల యజమానులు నిలదీస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇసుక ర్యాంపునకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే ఇసుకను ఎలా తరలిస్తారని మైన్స్ అధికారులు ట్రాక్టర్ల యజమానులను ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నందున ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నట్టు ఎచ్చెర్ల తహసీల్దారు చెబుతున్నారు.







• ఎడిటోరియల్

# మోడీని తక్కువ అంచనా వేయొద్దు

బంగ్లాదేశ్ విషయంలో మోడీ చాలామందికి ఉదాసీనతగానే కనిపిస్తున్నా వైరిపక్షం వలలో పడకూడదనే దూరదృష్టి ఉంది. భారత్ చుట్టూ ఉన్న దేశాలతో పోలిస్తే జియో పొలిటికల్ స్ట్రాటజీ విషయంలో మన దేశ విదేశాంగ శాఖ ప్రపంచంలోనే అత్యుత్తమ విధానాన్ని అమలుపరుస్తోంది. అదెలాగో తెలుసుకునే ముందు జో బైడెన్ యంత్రాంగం బంగ్లాదేశ్ ద్వారా భారత్‌లో ఎలాంటి విధ్వంసం సృష్టించాలనుకుంటుందో తెలుసుకోవడం ముఖ్యం. అయితే విధ్వంసం వ్యూహరచన ఎలా ఉందో ఇప్పటికే కొంత స్పష్టత వచ్చినా క్లియర్ పిక్చర్ ఏమిటో తెలియదు, కానీ విధ్వంసమే ధ్యేయంగా పావులు కదుపుతోంది. గత నెల రోజులుగా బంగ్లాదేశ్‌లో భారత్‌కి వ్యతిరేకంగా జరుగుతున్న పరిణామాలు కలవరపెడుతున్నాయన్నది నిజం. సీఐఏ నేరుగా పాకిస్థాన్‌తో చేతులు కలపకుండా జార్జ్ సోరోస్ ద్వారా ఫండింగ్ చేయిస్తోంది. నిజంగా అవి జార్జ్ సోరోస్ డబ్బులా, లేక సీఐఏ తన ప్రభుత్వానికి లెక్క చెప్పనవసరం లేని అకౌంట్‌లో నుంచి ఫండింగ్ చేస్తున్నదా అనేది తెలియదు. పాకిస్థాన్ ప్రభుత్వం దగ్గర డబ్బు లేదు కానీ.. ఐఎస్ఐ ద్వారా పాకిస్థాన్ సైన్యానికి కావలిసినంత డబ్బు అందుతోంది. ఐఎస్ఐ బంగ్లాదేశ్‌లోని రాడికల్ గ్రూపులకు కావాల్సినంత ధైర్యాన్ని ఇస్తోంది. ఐఎస్ఐ ద్వారా జార్జ్ సోరోస్ తన పని చేసుకుంటూ వస్తున్నాడు. ఇది ఇప్పటికే ఇరాక్, లిబియా, ఉక్రెయిన్, సిరియా దేశాలలో ఏదైతే పథక రచన చేసి విజయం సాధించారో, అదే విధంగా మన దేశం మీద అమలు చేస్తున్నారు. ముందు బంగ్లాదేశ్ నుంచి షేక్ హసీనాని బహిష్కరించడమో, లేక నకిలీ అభియోగాలు మోపి ఉరి తీయడమో చేయాలి. షేక్ హసీనా నియంత అని రాడికల్స్ ద్వారా ప్రచారం చేయించారు. రెండు రోజుల క్రితం ఢిల్లీలో ఉన్న షేక్ హసీనా స్వయంగా వెల్లడించిన దాని ప్రకారం తన మీద కుట్ర అనేది 2023 లోనే మొదలయింది అని, సరిగ్గా అదే సమయంలో సిరియా టార్గెట్‌గా పథక రచన చేశారు. దృష్టి మరల్చడానికి హమాస్, హెజ్బొల్లాలని వాడుకున్నారు. ఇరాక్, లిబియాల మాదిరిగానే బంగ్లాదేశ్‌లో కూడా బంగబంధు షేక్ ముజీబుర్ రెహ్మాన్ విగ్రహాలని, గుర్తులని చెరిపివేశారు రాడికల్స్. గత మూడు నెలలుగా ముజీబుర్ రెహ్మాన్ తమకు స్వాతంత్ర్యం తేలేదని ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు బహిరంగంగానే షేక్ ముజీబుర్ రెహ్మాన్‌ని, షేక్ హసీనాని దేశద్రోహులుగా యువతరం మనసులో ముద్ర వేసేశారు. బంగ్లాదేశ్‌ని ఇస్లామిక్ రిపబ్లిక్‌గా మారుస్తారని అక్కడే ఆగిపోతే పొరపాటు. బాంగ్లాదేశ్‌కి భారత్ మొదటి శత్రువు అని నూరిపోస్తున్నారు. ఐఎస్ఐ ఇప్పటికే అవసరం అయితే సైనిక సాయం చేస్తామని మాట ఇచ్చింది. దానిని రాడికల్స్ బలంగా నమ్ముతున్నారు. టర్కీ నుంచి పాకిస్తాన్ బైరాక్టర్ కామికాజ్ డ్రోన్లు కొనుగోలు చేసింది. బంగ్లాదేశ్‌కి నమ్మకం కుదరడానికి కొన్ని బైరాక్టర్ డ్రోన్లు ఉచితంగా ఇచ్చింది. రెండు రోజుల క్రితం బంగ్లాదేశ్ రిటైర్డ్ ఆర్మీ కల్నల్ ఒకడు మోడీని, భారత్ సైన్యాన్ని ఉద్దేశిస్తూ నాలుగు గంటల్లో అసోం, కోల్‌కతాలను స్వాధీనం చేసుకుంటామని అనడం వెనుక ఐఎస్ఐ ప్రచారం ఉంది. మోడీ పేరుని చెప్పడం వెనుక వ్యూహం ఉంది. 1971లో బంగ్లాదేశ్ విమోచనకు ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తోంది పాకిస్థాన్. బంగ్లాదేశ్ నుంచి నేరుగా మోడీ, భారత సైన్యాన్ని ఉద్దేశిస్తూ రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు రావడం వెనుక ఒక వ్యూహం ఉంది. పాకిస్తాన్ నుంచి మిసైల్స్, ఉగ్రవాదులు ఇప్పటికే బంగ్లాదేశ్‌కి చేరుకొని ఉండవచ్చు. ఈశాన్య రాష్ట్రాలతో సరిహద్దులు ఉన్న బంగ్లాదేశ్‌లో ఉన్న ఉగ్రవాదులు గెరిల్లా దాడులకి పాల్పడవచ్చు. మోడీ ముందు దౌత్యపరంగా ఎంత చేయవచ్చో అంతా చేస్తున్నారు. అఫ్కోర్స్.. అవేవి పనిచేయకపోవచ్చు. ఎయిర్‌టెల్ బంగ్లాదేశ్‌లోని సమ్మిత్ కమ్యూనికేషన్స్, ఫైబర్ ఎట్ ద హోమ్ అనే సంస్థలతో ఒప్పందం చేసుకుని ఈశాన్య రాష్ట్రాలలో ఇంటర్నెట్ సేవలను అందిస్తోంది. బంగ్లాదేశ్‌లోని అఖోరా బోర్డర్ ద్వారా కేబుల్స్ ఈశాన్య రాష్ట్రాలలోకి వెళ్తున్నాయి. ఇప్పుడు ఆ అగ్రిమెంట్‌ని రద్దు చేయాలని నిర్ణయం తీసుకుంది బంగ్లాదేశ్. దీనివల్ల ఈశాన్య రాష్ట్రాలలో హై స్పీడ్ కేబుల్ ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలుగుతుంది. దీనివల్ల ఈశాన్య రాష్ట్రాలలో హై స్పీడ్ ఇంటర్నెట్ లేకపోతే గెరిల్లా దాడులు చేయడానికి వీలుగా ఉంటుంది. భారత్ మీద శత్రుత్వంతోనే ఇన్నాళ్లూ బతికిన పాకిస్తాన్ పరిస్థితి ఏంటో చూస్తున్నాం. ఇప్పుడు మోడీ బంగ్లాదేశ్‌లో కూడా అదే వ్యూహాన్ని అమలుచేస్తారు. రోజులు గడిచే కొద్దీ ఆర్థిక ఇబ్బందులు, విద్యుత్ కోతలు, ఆహార సంక్షోభం, బాంకుల దివాలాలు చాలు తోకముడిచి అడుక్కోవడానికి!

## ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శిగా రమేష్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా 'విశాలాంధ్ర' స్టాఫ్ రిపోర్టర్ సనపల రమేష్‌ను రాష్ట్ర నాయకత్వం నియమించినట్టు యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్ ఈశ్వరరావు ప్రకటించారు. బుధవారం ఉదయం స్థానిక గరిమెళ్ళ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు. పలాస మహాసభలో ఎన్నికైన కార్యదర్శి, వ్యక్తిగత కారణాలవల్ల రాజీనామా చేయడంతో, ఆ పదవికి రమేష్‌ను ప్రతిపాదిస్తూ ఇటీవల జరిగిన యూనియన్ జిల్లా ముఖ్యుల సమావేశం రాష్ట్ర నాయకత్వానికి సిఫార్సు చేసింది. యూనియన్ విధి, విధానాలకు అనుగుణంగా రమేష్ పని చేస్తారనే ఆశాభావాన్ని ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు వ్యక్తం చేశారు. అతనికి రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ శుభాకాంక్షలు తెలిపారని ఆయన చెప్పారు. రమేష్ నియామకం పట్ల జిల్లా అధ్యక్షులు జగదీష్, జిల్లా మాజీ కార్యదర్శులు బెండి నర్సింగరావు, డి.మహారాణ, ఎలక్ట్రాన్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, మొదలవలస వాసు స్వామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంవి మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కుంచె చిన్నారావు, ఫోటో జర్నలిస్టుల సంఘం జిల్లా కన్వీనర్ సాంబశివరావు, గరిమెల ప్రెస్ క్లబ్ కార్యదర్శి ఎస్ నవచైతన్య, కోశాధికారి చౌదరి సత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



# మీడియాపై దాడులు హేయం




(సత్యంన్యూస్, విజయవాడ)

దేశవ్యాప్తంగా పాత్రికేయులపై దౌర్జన్యాలు, దాడులు, అవమానకర సంఘటనలు పెరగటం పట్ల నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్‌యూజే) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో ప్రముఖ పాత్రికేయ సంఘమైన ఎన్‌యుజె జాతీయ కార్యవర్గ సమావేశాలు జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో జరిగాయి. విజయవాడ క్లబ్‌లో ఎన్‌యూజే జాతీయ అధ్యక్షుడు రాస్ బిహారీ అధ్యక్షతన జరిగిన సమావేశం ఈశాన్య రాష్ట్రాలతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లో పాత్రికేయులపై దాడులు జరగటం పట్ల విచారం వ్యక్తం చేసింది. తాజాగా తెలుగు రాష్ట్రాల్లో సినీ నటుడు మోహన్‌బాబు కుటుంబం పాత్రికేయులపై దాడులకు దిగటాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. భవిష్యత్తులో దాడులు జరగకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానాన్ని ఎన్‌యూజే ఆమోదించింది.

### నకిలీ వార్తల పట్ల అప్రమత్తం

నకిలీ వార్తలు మీడియా ముందున్న అతిపెద్ద సవాలు అని ఎన్‌యూజే అభిప్రాయపడింది. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలతోపాటు అనేక సామాజిక ప్లాట్‌ఫారంలలో స్వార్థ ప్రయోజనాలతో ఉన్న వ్యక్తులు ఫేక్, వెరిఫై చేయని వార్తలను ఏ సమయంలోనైనా వైరల్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఫేక్, బోగస్ న్యూస్ మునుపెన్నడూ చూడని సవాల్ అని, ఇది విశ్వసనీయత ఉన్న జర్నలిస్టులకు శాపంగా మారిందని పేర్కొంది. నకిలీ, బూటకపు వార్తల నుంచి మీడియాను రక్షించడానికి, దాని విశ్వసనీయతను కాపాడటానికి జర్నలిస్టు సంస్థలు చేతులు కలపాలని పిలుపునిచ్చింది నకిలీ బోగస్ వార్తలు అరికట్టేందుకు మీడియా హౌసు లతో పాటు పాత్రికేయ సంఘాలు ముందుకు రావాలని తీర్మానించింది. జాతీయ స్థాయిలో ప్రెస్‌కౌన్సిల్ స్థానంలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు చేయాలని మరో తీర్మానంలో కోరింది. ఎన్‌యుజె జాతీయ ప్రధాన కార్యదర్శి మనోజ్ తివారి తీర్మానాలను ప్రవేశపెట్టారు.

### సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి


ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో కూడా గతంలో ప్రభుత్వాలు అమలు జరిపిన పాత్రికేయ సంక్షేమ కార్యక్రమాలను పునరుద్ధరించాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండివీఎస్ఆర్ పున్నంరాజు కోరారు. అక్రిడేషన్ల మంజూరు, ఆరోగ్య భీమా అమలు, పాత్రికేయులకు ఇళ్లస్థలాలు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. పాత్రికేయల ఇళ్లస్థలాల మంజూరుకు సంబంధించి ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పాత్రికేయులకు శరాఘాతంగా మారిందని ప్రభుత్వాలు దానిపై పునరాలోచన జరిపి కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాలని జాప్ ప్రధాన కార్యదర్శి ఎం యుగంధర్ రెడ్డి కోరారు. ఎన్‌యుజె ఉపాధ్యక్షులు శివకుమార్ దేశవ్యాప్తంగా పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. దేశవ్యాప్తంగా 20రాష్ట్రాలకు చెందిన ఎన్‌యుజె ప్రతినిధులతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన జాప్ సభ్యులు పెద్ద సంఖ్యలో ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్‌పై అరాచకవాదుల తప్పుడు ఫిర్యాదులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గరిమెళ్ళ ప్రెస్‌క్లబ్‌లో చొరబడటానికి జర్నలిస్టుల ముసుగులో కొన్ని అరాచకశక్తులు చేస్తున్న ప్రయత్నాల పట్ల బుధవారం ఉదయం జరిగిన అత్యవసర సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. తప్పుడు ఆరోపణలుతో ఎస్పీకి చేసిన ఫిర్యాదుపై తీసుకోవలసిన చర్యలపై సమావేశం చర్చించింది. ప్రెస్‌క్లబ్ స్థాపన నుంచి జరిగిన పరిణామాలను వ్యవస్థాపక కార్యదర్శి నల్లి ధర్మారావు వివరించారు. గతంలో కొందరు చేసిన తప్పుడు ఫిర్యాదులపై అధికార యంత్రాంగం స్వాధీనం చేసుకుని, ఎన్నికలు జరపాలని ప్రయత్నిస్తే హైకోర్టును ఆశ్రయించామని, ఎన్నికలు జరిపే అధికారం సొసైటీ యాక్ట్ ప్రకారం అధికార యంత్రాంగానికి తీర్పు చెప్పారు. ఈ తీర్పులోని ప్రధాన అంశాలను ఉత్తరాంధ్ర జర్నలిస్టుల ఫ్రంట్ అధ్యక్షుడు, న్యాయవాది చౌదరి లక్ష్మణరావు చదివి వినిపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వ్యవహారాన్ని చూస్తున్న పోలీసుశాఖ ఉన్నతాధికారులు తీర్పును అధ్యయనం చేసి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. క్లబ్ అధ్యక్షుడు ఎన్ ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జర్నలిస్ట్ నాయకులు జగదీష్, సనపల రమేష్, బాలకృష్ణ, మొదలవలస వాసు, కుంచె చిన్నారావు, ఎస్.నవచైతన్య, చౌదరి సత్యనారాయణ, జీ.వీ.నాగభూషణరావు, ముళ్ళపూడి సాయికుమార్, సున్నపు చెన్నారావు, యోగేశ్వరరావు పేడాడ హేమసుందర్, నరసింహమూర్తి, పొడుగురాజు, కళ్యాణ్ చక్రవర్తి, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.





# బహుముఖ ప్రజ్ఞాశాలి

ఆయన
ఒక కథా రచయిత, ఒక నవలా రచయిత, ఒక రంగస్థల నాటక రచయిత, ఒక వక్త, ఒక పాత్రికేయుడు, ఒక సినిమా రచయిత, ఒక సినిమా నటుడు, ఒక బుల్లితెర ప్రయోక్త. ఆ బహుముఖ ప్రజ్ఞాశాలి గొల్లపూడి మారుతీరావు.

సాహిత్య మారుతి... గొల్లపూడి గారి వర్ధంతి జ్ఞాపకం ! బహుముఖ ప్రజ్ఞాశాలి గొల్లపూడి మారుతీరావు. ఈ-టీవీ వారు నిర్వహించిన 'ప్రతిధ్వని' కార్యక్రమానికి వ్యాఖ్యాతగా, 'మనసున మనసై', 'ప్రజావేదిక', 'వేదిక', 'సినీ సౌరభాలు' వంటి ప్రాయోజిత కార్యక్రమాలకు కూడా వ్యాఖ్యాతగా వ్యవహరించారు. నటుడిగా 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య', 'యముడికి మొగుడు', 'స్వాతి ముత్యం', 'స్వాతి', 'ఆలయ శిఖరం', 'అభిలాష', 'గణపతి', 'ఎవరిగోల వారిది', 'ప్రేమలు పెళ్ళిళ్ళు' వంటి 290 సినిమాలకు పైగా నటించారు. వెండి తెరమీద విలన్‌గా, క్యారక్టర్ నటుడుగా ఎన్నో అద్భుతమైన పాత్రలకు ప్రాణం పోసిన దివంగత నటుడు మారుతీరావు గారు.

### - సినీరంగ ప్రస్థానం..

ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్ నిర్మాత కె.రాఘవ 1982లో కోడి రామకృష్ణ దర్శకత్వంలో 'ఇంట్లో రామయ్య – వీధిలో కృష్ణయ్య' అనే కుటుంబ కథా చిత్రాన్ని నిర్మించారు. ఆ సినిమా 22, ఏప్రిల్, 1982లో విడుదలై ఢంకా మోగించింది. అటు కోడి రామకృష్ణకు, ఇటు గొల్లపూడి మారుతీరావు ఇద్దరికీ ఇదే తొలిచిత్రం కావడం విశేషం. చిరంజీవి, మాధవి, పూర్ణిమ, సంగీత, అన్నపూర్ణ ప్రధాన తారాగణంగా నిర్మించిన ఈ చిత్రంలో ఒకలాంటి విలన్ పాత్రను గొల్లపూడి మారుతీరావు పోషించారు. 'వీడొట్టి సుబ్బారావోయ్' అనే ఊతపదాన్ని ఉచ్ఛరిస్తూ హీరోయిన్ మీద కన్నేసి చిరంజీవి సంసారంలో కలతలు సృష్టించే పాత్ర అది. దర్శకుడు దాసరి నారాయణరావు శిష్యుడుగా చాలా సినిమాలకు పనిచేసిన కోడి రామకృష్ణ, ఒక అద్భుత కథకు శ్రీకారం చుట్టి దాసరి సహకారంతో నిర్మాత రాఘవను మెప్పించగలిగారు. ఇందులో వినూత్న విలన్ 'సుబ్బారావు' పాత్రకు గొల్లపూడి మారుతీరావును తీసుకుందామని రాఘవ ప్రతిపాదించారు. తొలుత మారుతీరావు సినిమా నటనమీద పెద్దగా ఆసక్తి చూపలేదు. అయితే ఈ చిత్రానికి సంభాషణలు మారుతీరావే రాయాల్సి రావడంతో వేషం కూడా కట్టాల్సి వచ్చింది. సినిమా షూటింగ్ పాలకొల్లులో మొదలైంది. క్లైమాక్స్ దృశ్యాలను ముఖ్యంగా బోట్ ప్రయాణ దృశ్యాలను అంతర్వేదిపాలెంలోను, తరువాత చిరంజీవి ఇంటిలోనూ చిత్రీకరించారు. సినిమా బ్లాక్ బస్టర్‌గా నిలిచి మారుతీరావుకు విలన్ గా మంచిపేరు తెచ్చిపెట్టింది. ఈ చిత్రాన్ని నిర్మాత పంజు అరుణాచలం మణివన్నన్ దర్శకత్వంలో 'వీట్టుల రామన్ వెలియిల కృష్ణన్' పేరుతో పునర్నిర్మించారు. అలాగే హిందీలో 'ఘర్ మే రామ్ గలీ మే శ్యామ్' పేరుతో పునర్నిర్మించారు..

గొల్లపూడి మారుతీ రావు 12 డిసెంబర్ 2019న చెన్నైలో మరణించారు. వారి మృతికి పలువురు ప్రముఖ రచయితలు, తెలుగు చలన చిత్ర రంగ సభ్యులు సంతాపం తెలిపారు.

### - తొలి జీవన ప్రస్థానం

మారుతీరావు పుట్టింది ఏప్రిల్ 14, 1939న విజయనగరంలోని ఒక మధ్యతరగతి కుటుంబంలో. ఆయన తల్లిదండ్రులు అన్నపూర్ణ, సుబ్బారావు. మారుతీరావు ఆయన తల్లిదండ్రులకు ఐదవ సంతానం. చిన్నతనం నుంచే కళారంగం వైపు ఆయన అడుగులు వేశారు. విశాఖపట్నంలోని సి.బి.ఎం హైస్కూలు, ఎ.వి.ఎన్ కళాశాలతోబాటు ఆంధ్రా విశ్వవిద్యాలయంలో మారుతీరావు విద్యాభ్యాసం సాగింది. ఆంధ్ర సారస్వత పరిషత్తు విశాఖపట్నం నుంచి బి.ఎస్సీ ఆనర్స్ పూర్తిచేశారు. కాలేజీ రోజుల్లోనే నాటకాలు రాసి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన రాసిన తొలి కథ 'ఆశాజీవి' (1954). రాఘవ నికేతన్ పేరుతో మారుతీరావు ఒక నాటక సంస్థను నడిపేవారు. తద్వారా ఆది, కుక్కపిల్ల దొరికింది, స్వయంవరం, వాపస్, మహానుభావులు వంటి నాటకాలో నటిస్తూ దర్శకత్వం కూడా వహించేవారు. కొంతకాలం పాత్రికేయుడిగా సేవలందించిన మారుతీరావు 1959లో ఆంధ్రప్రభ పత్రికలో ఉపసంపాదకుడుగా జీవన ప్రస్థానం ప్రారంభించారు. తరువాత ఆకాశవాణిలో రేడియో ప్రసార అధికారిగా ఎంపికై హైదరాబాదు, విజయవాడ కేంద్రాలలో పనిచేశారు. 1961 నవంబరు 11న మారుతీరావు శివకామసుందరిని హనుమకొండలో వివాహమాడారు. వారికి ముగ్గురు సంతానం. వారు సుబ్బారావు, రామకృష్ణ, శ్రీనివాస్. తరువాత కార్యక్రమ నిర్వాహకుడుగా పదోన్నతి పొంది ఒడిశా రాష్ట్రంలోని సంభల్పూర్, మద్రాసు, కడప కేంద్రాలలో పనిచేశారు. 1981లో ఆకాశవాణి, కడప కేంద్రంలో పదోన్నతి పొంది రెండు దశాబ్దాలపాటు సహాయ స్టేషన్ డైరెక్టర్‌గా సేవలందించారు. ఆయన తొమ్మిది నాటకాలు, పద్దెనిమిది నాటికలు, పన్నెండు నవలలు, నాలుగు బౌండ్ పుస్తకాల నిండా కథలు, అసంఖ్యాకంగా వ్యాసాలు రాశారు. సాంఘిక, రాజకీయ సమస్యలను తూర్పార బడుతూ గత ఇరవై నాలుగేళ్ళుగా 'జీవన కాలమ్' అనే ధారావాహికను వారం వారం నిర్వహిస్తూ వచ్చారు. ఈ ధారావాహికలు ఆంధ్రజ్యోతి, వార్త వంటి దినపత్రికలలో కనిపించేవి. తెలుగు సాహిత్యం మీద మారుతీరావు రాసిన అనేక పరిశోధనాత్మక రచనలు, నాటకాలు తెలుగు రాష్ట్రాలలోని పలు విశ్వవిద్యాలయాలలో పాఠ్యాంశాలుగా వినియోగంలో ఉన్నాయి.

### - అన్నపూర్ణా సంస్థలో...

'ఇద్దరుమిత్రులు' సినిమా నిర్మాణ సమయంలోనే నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు 'కాలాతీత వ్యక్తులు' అనే నవలను చదివారు. రచయిత్రి డాక్టర్ పి.శ్రీదేవిని పిలిపించి ఆ నవలను సినిమాగా తీస్తే ఎలా వుంటుందనే విషయాన్ని చర్చించారు. ఆ నవల కథాంశం సినిమాకు పనికిరాదని గ్రహించి, చదువుకుంటున్న ఆడపిల్లల సమస్యల నేపథ్యంలో ఒక కథను అల్లమని ఆమెతో చెప్పారు. ఆ సబ్జెక్టు చర్చల స్థాయిలో ఉండగానే శ్రీదేవి కాలం చేయడంతో త్రిపురనేని గోపీచంద్ చేత మాటలు, యద్దనపూడి సులోచనారాణి చేత స్క్రీన్‌ప్లే రాయించి 'చదువుకున్న అమ్మాయిలు' సినిమా నిర్మించారు. అయితే, పూర్తి నిడివి నవలా చిత్రాన్ని తీయాలనే ఆలోచన దుక్కిపాటిని వదలలేదు. 1962లో ఆంధ్రప్రభ వారు శుభకృత్ సంవత్సర ఉగాది నవలలపోటీ నిర్వహిస్తే కోడూరి కౌసల్యాదేవి నవల 'చక్రభ్రమణం'కి ప్రథమ బహుమతి లభించింది. న్యాయ నిర్ణేతల సంఘంలో సభ్యుడుగా వ్యవహరించిన దుక్కిపాటి స్నేహితుడు గోపీచంద్ ఈ నవలను సినిమాగా తీస్తే నవలా చిత్రాన్ని తీయాలనుకుంటున్న ఆశయం కూడా నెరవేరుతుందని సలహాయిచ్చి, ఆ నవల హక్కులు కొనమన్నారు. దుక్కిపాటి నిర్ణయం తీసుకోవటంలో జాప్యం జరిగింది. ఈలోగా ఆ నవల మార్కెట్లో విడుదలై విపరీతమైన జనాదరణ పొందింది. పాఠకులు దానిని సినిమాగా తీస్తే ఏయే నటీనటులు ఆయా పాత్రలకు సరిపోతారో సూచిస్తూ అన్నపూర్ణా సంస్థకు అసంఖ్యాకంగా ఉత్తరాలు రాశారు. అప్పుడు దుక్కిపాటి రాజమండ్రి వెళ్లి ఆ నవల హక్కుల్ని కొని, కౌసల్యాదేవినే సినిమాకి సంభాషణలు రాయవలసిందిగా కోరారు. ఇరవై యేళ్ళుకూడా నిండని ఆమెను మద్రాసు పంపడం ఇష్టం లేదని ఆమె తల్లిదండ్రులు తేల్చిచెప్పడంతో, ఆచార్య ఆత్రేయతో మాటలు రాయించారు. సగటు ప్రేక్షకుడికి అర్థమయ్యేలా ఉండాలని కౌసల్యాదేవే ఈ సినిమాకి 'డాక్టర్ చక్రవర్తి' అనే పేరును సూచించారు. చక్రభ్రమణం నవల ధారావాహికంగా వెలువడినప్పుడు ఆంధ్రప్రభలో సబ్–ఎడిటరుగా పనిచేసిన మారుతీరావుకు ఆ నవల గురించి సంపూర్ణ అవగాహన వుండటం చేత, స్క్రీన్‌ప్లే బాధ్యతలు అతనికి అప్పజెప్పారు. నిజానికి స్క్రీన్‌ప్లే రచనలో కె.విశ్వనాథ్, ఆదుర్తి, దుక్కిపాటి కూడా పాలుపంచుకున్నా, మారుతీరావు ప్రతిభను ప్రోత్సహించాలని టైటిల్ కార్డులో ఆయన పేరు మాత్రమే వేశారు. అప్పట్లో హైదరాబాదు ఆకాశవాణిలో పనిచేస్తున్న మారుతీరావు సినీ ప్రస్థానం ఈ సినిమాతోనే మొదలైంది. ఈ సినిమా 1963లో విడుదలై విజయవంతంగా ఆడింది.

- ఆచారం షణ్ముఖాచారి

### - మరిన్నివిశేషాలు..

1992 మారుతీరావు చిన్న కుమారుడు శ్రీనివాస్ తొలిప్రయత్నంగా 'ప్రేమపుస్తకం' అనే సినిమా నిర్మించి దర్శకత్వం వహిస్తూ ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మరణించాడు. ఆ చిత్రాన్ని మారుతీరావు పూర్తి చేశారు. మారుతీరావు తన కుమారుని జ్ఞాపకార్థం ఒక జాతీయ అవార్డును నెలకొల్పారు. తద్వారా ప్రతి ఏటా ఒక దర్శకునికి ఈ అవార్డు కింద లక్షా యాభైవేల రూపాయలు పారితోషికంతో బాటు, బంగారు జ్ఞాపికను బహూకరించడం మొదలెట్టారు. ఆ సందర్భంగా సినిమాకు సంబంధించిన యేదేని విషయం మీద ఉపన్యాసం చేసిన వారికి గౌరవ సూచకంగా పదిహేను వేలరూపాయలు 'శ్రీనివాస్ మెమోరియల్ లెక్చర్' పేరుతో బహూకరిస్తున్నారు. సునీల్ దత్, నసీరుద్దీన్ షా, మృణాల్ సేన్, శ్యామ్ బెనగల్, జావేద్ అఖ్తర్, అనుపమ్ ఖేర్ మొదలైన వారు ఈ అవార్డును అందుకున్నారు. మారుతీరావు కుమారులిద్దరూ ట్రావెల్ ఏజెన్సీ నడుపుతున్నారు.

2002లో మారుతీరావుకు రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు దక్కింది. 'కళ్ళు' నాటకానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. ఈ నాటకాన్ని అన్ని భారతీయ భాషల్లోకి నేషనల్ బుక్ ట్రస్టు వారు అనువదింపజేశారు. ఈ నాటకం ఉస్మానియా విశ్వవిద్యాలయ ఎం.ఎ. (తెలుగు) విద్యార్థులకు పాఠ్యపుస్తకంగా నిర్దేశించారు. ఉత్తమ హాస్యరచనకు మారుతీరావుకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి 'సర్వారాయ మెమోరియల్' అవార్డు కింద బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. రామాయణంలో భాగవతం సినిమాలో ఉత్తమ నటుడిగా శంకర్‌దయాళ్ శర్మచే పురస్కార ప్రదానం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళారత్న' అవార్డును కూడా ప్రదానం చేసింది. జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థలో సభ్యునిగా మారుతీరావు వ్యవహరించారు. 1978లో మద్రాసులో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఆకాశవాణి తరపున సమీక్షకునిగా మారుతీరావు వ్యవహరించారు.



# ఆయువు పోస్తుందా.. ఆయుధమేదైనా?

"నీకు
తెలియనిదా నేస్తమా? విద్వేషం పాలించే దేశం ఉంటుందా?
విధ్వంసం నిర్మించే స్వర్గం ఉంటుందా? ఉండుంటే అది మనిషిది అయి
ఉంటుందా? అడిగావా భూగోళమా?నువ్వు చూశావా ఓ కాలమా? రా
ముందడుగేద్దాం..యుద్ధం అంటే అర్థం ఇది కాదంటూ
సరిహద్దుల్నే చెరిపే సంకల్పం అవుదాం. ప్రేమను మించిందా
బ్రహ్మాస్త్రానికైనా? ఆయువు పోస్తుందా ఆయుధమేదైనా? రాకాసుల
మూకల్లె మార్చద పిడివాదం? రాబందుల రెక్కల సడి ఏ జీవన వేదం?
సాధించేదేముంది ఈ వ్యర్థ విరోధం? ఏ సస్యం పండించదు మరు భూముల
సేద్యం.. రేపటి శిశువుకు పట్టే ఆశల స్తన్యం.. ఈ పూటే ఇంకదు అందాం..
నేటి దైన్యానికి ధైర్యం ఇద్దాం.. రా ముందడుగేద్దాం.. యుద్ధం అంటే అర్థం
ఇది కాదంటూ.. సరిహద్దుల్నే చెరిపే సంకల్పం అవుదాం.. అందరికి సొంతం
అందాల లోకం కొందరికే ఉందా పొందే అధికారం? మట్టి తోటి చుట్టరికం
మరిపించే వైరం.. గుర్తిస్తుందా మనిషికి మనిషితోటి బంధం?.. ఏ కళ్యాణం
కోసం ఇంతటి కల్లోలం? నీకు తెలియనిదా నేస్తమా.. ఎవ్వరి క్షేమం కోసం ఈ
మారణ హెూమం?.. చెంత చేరననే పంతమా?.. ఖండాలుగ విడదీసే
జండాలన్ని తలవంచే తలపే అవుదాం ఆ తలపే మన గెలుపని అందాం"..

కంచె సినిమాలో సిరివెన్నెల పాట ఇది.

ఎవరి దేశం ఎవరి సొంతం? ఎవరు ఆక్రమణదారులు? పొరుగు దేశాన్ని ముక్కలు చేసి రెండు కొత్త దేశాలను సృష్టించిన రష్యా.. ఇదే సూత్రంతో ఎన్ని దేశాలనయినా సృష్టించగలదు. ఉక్రెయిన్ మీద యుద్ధానికి రష్యా చెప్పుకునే కారణాల్లో బలమెంత? నిజమెంత? విద్వేషం పాలించే దేశాలు ఉన్నాయి. విధ్వంసం నిర్మించే నరకాలు ఉన్నాయి. భూగోళం చూస్తోంది. ఈకాలం వింటోంది. సరిహద్దుల కోటగోడలను నిర్మించడమే నవీన నీతి. ఆయువు తీసే ఆయుధమే ఇప్పటి పాఠం. రేపటి శిశువుకు పట్టే ఆశల స్తన్యాన్ని ఈపూటే ఇంకింపజేయడమే ఇప్పటి యుద్ధ ధర్మం. ఖండాలుగా విడదీసే జెండాలే ఇప్పటి అజెండా. సిరివెన్నెల పాటలు, తిలక్ కవితలు వినపడాల్సినవాళ్లకు వినపడవు. వినిపించినా అర్థం కాదు. అర్థమయినా ఆయుధం వదలరు. ఆయుధం వదిలినా పగను వదులుకోరు. యుద్ధం ఏదయినా మొదట చచ్చేది సైనికులే. ఆపై చావల్సినవాళ్లు సామాన్యులే.



దేశాల యుద్ధాల నెగళ్ళలో చలికాచుకునే ప్రపంచం. ఆయుధాల వ్యాపారాలకు యుద్ధాల మార్కెట్లను తయారుచేసే పెద్దన్న దేశాలు. యుద్ధాల బూచిలో విజయాల స్వప్నాలను నిజం చేసుకునే మహానేతలు. అర్థంలేని వైషమ్యాల్లో అర్థంకాకుండా చనిపోయి ప్రశ్నించలేని సిపాయిల కుత్తుకలు.

*దేశం ఏదయినా విద్వేషం గెలుపు సూత్రం.*
*దేశం ఏదయినా విధ్వంసం బలవంతపు అంగీకారం.*
*"ఇక్కడ నేను క్షేమం.. అక్కడ నువ్వు కూడా..*
*ఇప్పుడు రాత్రి, అర్ధరాత్రి.. నాకేం తోచదు నాలో ఒక భయం*
*తెల్లని దళసరి మంచు రాత్రి చీకటికి అంచు దూరంగా పక్క డేరాలో*
*కార్పోరల్ బూట్స్ చప్పుడు.. ఎవరో గడ్డి మేట నుంచి పడ్డట్టు..*
*నిశ్శబ్దంలో నిద్రించిన సైనికుల గురక..చచ్చిన జీవుల మొరలా వుంది.*
*పోదు నాలో భయం.. మళ్ళీ రేపు ఉదయం ఎడార్లు నదులూ*
*అరణ్యాలు దాటాలి.. ట్రెంచెస్‌లో దాగాలి..*
*పైన ఏరోప్లేను, చేతిలో స్టెన్ గన్.. కీయిస్తే తిరిగే అట్ట ముక్క*
*సైనికులం.. మార్చ్!*

వన్ టూ త్రీ షూట్ డెడ్ ఎవడ్?..నువ్వా నేనా?.. కేబుల్ గ్రాం యిప్పించండి కేరాఫ్ సో అండ్ సో.. (మీ వాడు డెడ్.)

సృహ తప్పిన ఎనెస్తిషియాతో వెన్నెముక కర్రలా బిగిసింది..

యుద్ధం యుద్ధం..లిబియాలో బెర్లిన్లో స్టాలిన్ గ్రాడ్‌లో స్వార్థం పిచ్చి కుక్కలా పెరిగింది.

నేనిది వరకటి నేను కాను.. నాకు విలువల్లేవు.. నాకు అనుభూతుల్లేవు.. చంపడం, చావడం..మీసం దువ్వడం లాంటి అలవాటయ్యింది.

కనిపించే ఈ యూనిఫారం క్రింద ఒక పెద్ద నిరాశ, అనాగరికత బ్రిడ్జీ క్రింద నది లాగా రహస్యంగా వుంది. వదల లేని మోపు ఊబిలాగా వుంది. నేనంటే నాకే అసహ్యం.. అందుకే మరీ మరీ చంపుతాను, మరీ మరీ తాగుతాను.. ఇంకేం చేసినా ఎవరూ ఒప్పుకోరు.



## ఆయుధ పరిశ్రమ ఆదాయం
## రూ.53 లక్షల కోట్లు

Courtesy: Sakshi

**యుద్ధాల నేపథ్యంలో 4 శాతం పెరుగుదల**
- ఆయుధ మార్కెట్‌పై అమెరికాదే ఆధిపత్యం
- 2023లో 317 బిలియన్ డాలర్ల ఆర్జన

స్టాక్‌హోం: యుద్ధాలు, ప్రాంతీయ ఘర్షణల నేపథ్యంలో ప్రపంచ ఆయుధ పరిశ్రమ ఆదాయం 2023లో 632 బిలియన్ డాలర్లకు (రూ.53 లక్షల కోట్లు) పెరిగింది. 2022తో పోలిస్తే ఇది 4.2 శాతం అధికం. ఆయుధ రంగంలో అమెరికా ఆధిపత్యం కొనసాగుతోంది. లాక్‌హీడ్ మార్టిన్, రేథియోన్ వంటి యూఎస్ ఆయుధ కంపెనీలే అధికాదాయం పొందాయి. స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిప్రి) నివేదిక ప్రకారం టాప్ 100 కంపెనీల్లో 41 కంపెనీలు 317 బిలియన్ డాలర్ల ఆదాయం పొందాయి. ఇది గతేడాది కంటే 2.5 శాతం ఎక్కువ. ఆయుధ పరిశ్రమలో రెండో అతి పెద్ద దేశమైన చైనా టాప్ 100 జాబితాలోని తొమ్మిది కంపెనీల నుంచి 103 బిలియన్ డాలర్లను ఆర్జించింది. అయితే ఆర్థిక పరిమితులు, ఇతర సవాళ్లతో దాని వృద్ధి 0.7 శాతం తగ్గింది.

**స్వావలంబన దిశగా భారత్**

భారత ఆయుధ పరిశ్రమకు 2023లో 6.7 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చింది. 2022తో పోలిస్తే ఇది 5.8 శాతం ఎక్కువ. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రయోజనం పొందాయి. చైనాతో సరిహద్దు ప్రతిష్టంభన, విదేశీ ఆయుధ సరఫరాదారులపై ఆధారపడటాన్ని తగ్గించాల్సిన అవసరం స్వయం సమృద్ధికి ఆజ్యం పోశాయి. భారత్, తుర్కియే దేశీయ ఆయుధోత్పత్తిని విస్తరించి స్వావలంబనపై దృష్టి సారించాయి.

**ఘర్షణల నేపథ్యంలో పెరిగిన ఉత్పత్తి**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచ ఆయుధ ఉత్పత్తిని పెంచడంలో ముఖ్య పాత్ర పోషించింది. డిమాండ్‌కు అనుగుణంగా యూరప్, అమెరికా, తుర్కియేలోని రక్షణ సంస్థలు ఆయుధ తయారీని పెంచాయి. పలు దేశాల రక్షణ సంస్థల్లో ఆయుధాల అమ్మకాలు పెరిగాయి. తుర్కియే రక్షణ సంస్థ బేకర్ ఆదాయం 25 శాతం పెరిగి 1.9 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది ఎక్కువగా డ్రోన్లను ఎగుమతి చేసింది. చైనాతో ఉద్రిక్తతల మధ్య తైవాన్ రక్షణ వ్యయాన్ని పెంచడంతో ఆ దేశ ఎన్సీఎస్ఐఎస్టీ ఆదాయం 27 శాతం పెరిగి 3.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. యూకే సంస్థ అయిన అటామిక్ వెపన్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆదాయం 16 శాతం పెరిగి 2.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ఆయుధ ఆదాయాన్ని ఎలా నడిపిస్తున్నాయో సిప్రి నివేదిక ఎత్తిచూపింది.

తిరిగి ఎప్పుడు మన ఊరు వస్తానో!.. నిన్ను చూస్తానో?..ఎన్నాళ్ళకి? ఎన్నాళ్ళకి?.. కొన్ని వేల మైళ్ళ దూరం మన మధ్య ఒక యుగంలా అడ్డు పడింది. ఇంక సెలవ్ మై డియర్!..

నిద్ర వస్తోంది మత్తుగా నల్లగా అదుగో సెంట్రీ డేరా ముందు గోరీలా నిలబడ్డాడు... మళ్ళీ జవాబు వ్రాయ్ సుమీ!

ఎన్నాళ్ళకో మరీ.. సెలవ్! అబ్బా! చలి!..చలి గుండెల మీద కత్తిలా తెగింది. నీ రూపం నా దేహానికి వెచ్చగా తగిలింది"

దాదాపు డెబ్బయ్, డెబ్బయ్ అయిదేళ్ల కిందట దేవరకొండ బాల గంగాధర తిలక్ రాసిన కవిత ఇది. నాలుగు పదుల వయస్సు మాత్రమే బతికి తన అక్షరాలను వెన్నెల్లో ఇసుక తిన్నెల్లో ఆడుకునే అమ్మాయిల్లా తీర్చి దిద్దినవాడు తిలక్. కవితా సతి నొసట నిత్య రస గంగాధర తిలకం- అని శ్రీ శ్రీ అంతటి వాడు పొంగి పరవశించిన కవిత తిలక్ ది. తెలుగు లేఖా సాహిత్యంలోనే ఆణిముత్యంలాంటి కవిత ఇది. ఒకప్పుడు తిలక్ రాసిన నీవులేవు నీపాట ఉంది. ఈ సైనికుడి ఉత్తరం కవితలు చదవనివారు అసలు ఉండేవారే కాదు.

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఏ దేశం కోసమో, ఏ దేశంతోనో, ఎక్కడో యుద్ధం చేసే మన సైనికుడి మానసిక సంఘర్షణను తిలక్ ఈ కవితలో ఒక డాక్యుమెంటరీ కంటే అద్భుతంగా రికార్డు చేశాడు. ఆ మధ్య క్రిష్ చక్కగా తెరకెక్కించిన కంచె సినిమా కథకు మాతృక ఈ కవితే.

అన్నట్లు.. ఆసియా ఖండంలో ఉద్రిక్తలు.. రష్యా- ఉక్రెయిన్.. గాజా గొడవల నేపథ్యంలో ప్రపంచ ఆయుధాల మార్కెట్ పంట పండిందట. ప్రపంచంలో పేరున్న వంద ఆయుధ తయారీ కంపెనీలు గడచిన ఒక్క సంవత్సరం అమ్మిన ఆయుధాల విలువ అక్షరాలా 53లక్షల కోట్లట. యాభై మూడు తరువాత ఎన్ని సున్నాలు పెడితే ఈ లెక్క సరిపోతుంది అన్నది సన్యాసులో, సున్నాసులో తీరుబడిగా చేసుకోవాల్సిన పని. బూడిద చేసే సున్నాలకు విలువేముంది? అని మనమనుకుంటే బూడిదచేయడంలోనే అంతులేని వ్యాపారం దాగి ఉందని ఆయుధ వ్యాపారులు చెప్తారు.

నిజజీవితంలో జరక్కపోయినా సినిమా తెరమీద 84 ఏళ్ళక్రితం ది గ్రేట్ డిక్టేటర్ సినిమా ముగింపులో ది గ్రేట్ చార్లీ చాప్లిన్ ప్రపంచశాంతిని కోరుతూ.. యుద్ధం వద్దేవద్దని చెప్పిన అనన్యసామాన్యమైన ఉపన్యాసం వినండి:-

-పమిడికాల్వ మధుసూదన్

## 17న విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం

(సత్యంన్యూస్, పొందూరు)

ఈనెల 17న ఉదయం 9.30గంటలకు స్థానిక పట్టుశాలి కళ్యాణ మండపంలో విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం జరుగుతుందని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అంకం ధర్మారావు, పాలిశెట్టి సూర్యప్రకాశ రావు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక ఉప ఖజానాశాఖాధికారి(ఎస్.టి.వో)కె.ఎస్.ఎస్.ప్రసాద్ పాల్గొం టారన్నారు. మొత్తం 10మంది సీనియర్ విశ్రాంత ఉద్యోగులకు సంఘం పక్షాన సన్మానించనున్నట్టు ధర్మారావు, సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు.



## ప్రజలకు చేరువగా శంకర్ పాలన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రజలకు అందు బాటులో ఉంటూ ప్రజారంజక పాలన అందిస్తున్నా రని నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే శంకర్ విశేష కృషి చేస్తున్నారన్నారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఆరు నెలలలో ఎన్నికలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజా ఆకాంక్షలకు ఆశయాలకు అనుగుణంగా చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ప్రతినెలా ఒకటవ తేదీకి ఇంటింటికీ వెళ్లి పెన్షన్ అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతుల నెత్తిన పాలు పోసిందన్నారు. రహదారులు కూడా బాగు చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలబెడు తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా కూటమి ప్రభుత్వాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఈ విషయాన్ని వైకాపా నాయకులు గుర్తెరగాలన్నారు.

## పాత స్థలాల్లోనే కొనసాగించాలి

(సత్యంన్యూస్, టెక్కలి)

ఫుట్‌పాత్ వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపే వరకూ పాత స్థలాల్లోనే అమ్మకాలు కొనసాగించే విధగా చూడాలని సీపీఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు,కొల్లి యల్లయ్యలు కోరారు. ఈమేరకు బుధవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అవగాహన లేని సర్దుబాటు చేసి రోడ్డు ప్రక్కన వ్యాపారాలు చేసుకునే తోపుడుబళ్ల వ్యాపారుల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. తోపుడుబండి కొలతలు ఆరడుగుల విస్తీర్ణంలో ఉంటే ఐదడుగుల స్థలాన్ని కొలిచి ఇచ్చారని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కనీసం సంక్రాంతి వరకు అయిన పాతస్థలంలో ఉంటామన్నా వ్యాపారులు అంగీకరించడం లేదన్నారు. పట్టుమాదేవి కోనేరు వెనుక గట్టు కేటాయించమన్నా సాధ్యం కాదని చెబుతున్నారన్నారు. పాత బస్టాండు మార్కెట్ షెడ్ వెనుక భాగంలో రెండు వరుసల బళ్లు ఏర్పాటు చేసుకుంటామని అడుగుతున్నా అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాధీబాండారు, సోషల్‌క్లబ్ రైతుబజార్‌గా మార్పు చేయమంటే కోర్టు కేసులు అంటున్నారని, ఈ పరిస్థితుల్లో ఫుట్‌పాత్ వ్యాపారులు తమ వ్యాపారాలను ఎలా సాగిస్తారని ప్రశ్నించారు. స్థానిక టీడీపీ నాయకులు పినకాన అజయ్‌కుమార్ మంత్రితో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ఫోన్ కలవడం లేదన్నారు. వీటిని గమనించి పాత స్థలాల్లోనే వ్యాపారాలు సాగించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో తోపుడు బళ్లు సంఘం నాయకులు ఉర్జాన మాధవరావు, యల్.వరద రాజులు, టి.సీతమ్మ, డి.కామేశ్వరి, కె.చిన్నమ్మడు, రజిని, రాము, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భూ సమస్యలను శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామసదస్సులను నిర్వహిస్తుందని లావేరు తహశీల్దార్ వై.జోగారావు అన్నారు. గురువారం లోపెంట గ్రామ సచివాలయం వద్ద గ్రామసభను నిర్వహించారు. పలువురు రైతుల నుంచి భూసమస్యలపై తహశీల్దార్ ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యలపై రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వీటిని పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ తిరుపతిరావు, మండల సర్వేయర్ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ పైడియ్య, వీఆర్వో మల్లేశ్వరరావు, కూటమి నేతలు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం జరిగేవరకూ పోరాడుతాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని మున్సిపల్ ఇంజినీరింగ్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి.తిరుపతిరావు, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్యామలరావు, సంతోష్‌లు అన్నారు. 6వరోజు రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ శాఖా మంత్రి స్పందించి న్యాయమైన కోర్కెలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్‌శాఖలో కీలకమైన ఇంజినీరింగ్ సిబ్బంది సమస్యలపై చొరవ చూపకపోవడం అన్యాయమన్నారు. టెక్నిక్, నాన్ టెక్నికల్ వారీగా రూ.29,200లు, రూ.24,500లు వేతనాలు అమలు చేయాలన్నారు. రిటైర్ కార్మికులకు రూ.10లక్షలు ఇవ్వాలని, 15సంవత్సరాల సర్వీస్ దాటిన వారికి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగన్, శ్రీను, రామారావు, సతీష్, అర్జున్‌లు పాల్గొన్నారు.




## నీరజ, ఉమాకవికి బెస్ట్ పార్టిసిపేషన్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పూర్వపు శ్రీకాకుళం జిల్లాలో ఉన్న సుమారు 200మంది ఉపాధ్యాయులకు ఎఫ్.ఎల్.ఎన్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా 4వరోజు శిక్షణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న గార మండలం ఆదవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భోగెల ఉమామహేశ్వరరావుకి,, జి.సిగడాం మండలం వాంద్రంగి ఎం.పి.యు.పి.పాఠశాల హెచ్.ఎం వాంద్రంగి నీరజకు బెస్ట్ పార్టిపేషన్‌గా గుర్తించి కె.ఆర్.పి కె.అరుణ కుమారి అభినందించారు. అనంతరం ఈ కార్యక్రమంలో గ్రూప్ 1డి.ఆర్.పి లు ఎస్.జయరాం, కె.దుర్గప్రసాద్, ఇ.తిరుపతిరావులు ఆంగ్లం పై శిక్షణ ఇచ్చారు. పుష్ప-2 గ్రూప్ ఉపాధ్యాయులు డి.మధుకుమార్, కె.రమణమూర్తి, నరసింహ చౌదరి తదితరులు పాల్గొన్నారు.


ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్య..!




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ వసతి గృహంలో మూడో ఫ్లోర్ నుంచి బుధవారం అర్ధ రాత్రి సివిల్‌ఇంజినీరింగ్ మొదటి ఏడాది విద్యార్థి ఆర్.ప్రవీణ్‌నాయక్ దూకేశాడు. క్యాంపస్ అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. కానీ ఫలితం లేకుండాపోయింది. చికిత్స అందిస్తుండగానే ఐటీ విద్యార్థి ప్రవీణ్ నాయక్ మృతి చెందాడు. ప్రవీణ్ నాయక్ సొంత గ్రామం ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం. విషయం తెలుసుకున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కెవిజిడి బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, ఎస్పై సందీప్ కుమార్ అక్కడకు చేరుకున్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీలో ఏడాదికో విషాదం వెంటాడుతునే ఉంది. పీయూసీ, ఇంజనీరింగ్‌లో సుమారు 4,200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 2022 సెప్టెంబర్ 7న ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. అదే ఏడాది నవంబర్‌లో 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజుల పాటు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. క్యాంపస్‌లోనే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. అంతా సవ్యంగా సాగుతుందన్న తరుణంలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. రెండేళ్ల క్రితం పీయూసీ రెండోఏడాది చదువుతున్న విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన విద్యార్థిని బవిరి వశిష్ట రోహిణి(17) మధ్యాహ్నం పన్నెండున్నర సమయంలో వసతి గృహంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ రోజు నిర్వహించిన పరీక్షలు సక్రమంగా రాయనందున తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు స్నేహితులు చెప్పుకొచ్చారు. సరిగ్గా రెండేళ్ల తర్వాత మరోమారు ట్రిపుల్ ఐటీలో విషాదం చోటుచేసుకుంది. ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతిపట్ల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంతాపం తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవీణ్ నాయక్ ఆత్మహత్య చేసుకోవడం పట్ల మంత్రి విచారం వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు తక్షణమే తెలపాలని అధికారులకు, పోలీసులకు మంత్రి ఆదేశించారు.

**ట్రిపుల్ ఐటీని తనిఖీ చేసిన ఎమ్మెల్యే**

భవనం మీద నుంచి దూకి విద్యార్థి చనిపోయాడని తెలుసుకున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్ క్యాంపస్‌ను గురువారం తనిఖీ చేశారు. ఏం జరిగిందన్న విషయం మీద ఆరా తీశారు. ఎమ్మెల్యేతో పాటు డీఎస్పీ వివేకానంద, తహసీల్దార్‌లు కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# పర్యావరణం పాతమాట.. ఇసుక తవ్వకాల్లో అందరికీ వాటా

మొదటిపేజీ తరువాయి

లేదు. దీన్ని ఆసరాగా చేసుకొని వైకాపా హయాంలో ఇసుక మాఫియాను నడిపించిన నక్క గణేష్ తన సొంత ట్రాక్టర్లతో ఇసుకను నీలిమ వేబ్రిడ్జ్ వద్ద స్టాక్ చేయించి, అక్కడి నుంచి లారీ, ట్రాక్టర్లకు లోడ్ చేయిస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. నీలిమ వే బ్రిడ్జ్ యజమాని నక్క జగదీష్‌తో జత కలిసి నక్క గణేష్ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. వీరితో పాటు బైరిలో ఉన్న టీడీపీలోని రెండు వర్గాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేస్తునే ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఉచిత ఇసుక విధానాన్ని ఆసరాగా చేసుకొని సొంత అవసరాల నిమిత్తం ఇసుక తరలిస్తున్నట్టు చూపించి ఇసుకను జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. ఇసుకను బైరి వద్ద నదిలో బాటలు వేసి ట్రాక్టర్లకు జేసీబీలతో లోడ్ చేసి ఒడ్డుకు చేరుస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు సెమీ మెకానిజంను వినియోగించడానికి వెసులుబాటు కల్పించడంతో అక్రమార్కులు అనుమతి లేనిచోట జేసీబీలను నదుల్లో దించి వాహనాలకు లోడ్ చేస్తున్నారు. నదిలో వరదలు వచ్చిన సమయంలోనూ బైరిలో ఇసుక అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయకుండా ఇసుకను ఒడ్డుకు చేర్చారు. ఇసుకను ఒడ్డుకు చేర్చడం కోసం ప్రొక్లెయినర్స్‌తో నది గట్టులను తొలిచి బాటలు వేశారు. దీన్ని ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చిన తర్వాత లారీల్లో విశాఖకు తరలించుకుపోవడానికి ఒక మార్గంగా అక్రమార్కులు ఎంచుకున్నారు. ఈ ప్రాంతాల్లోనే స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేసి రాత్రి పగలు తేడా లేకుండా తరలిస్తున్నారు. బైరిలో ఇసుక పరిమితికి మించి తవ్వేశారు. మడపాం జాతీయ రహదారి వంతెన కింద ఇసుకను జేసీబీలతో తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నా అధికారులు స్పందించడం లేదు. వంతెనకు 500 మీటర్ల పరిధిలో ఇసుక తవ్వడానికి వీల్లేదు. ఈ నిబంధనకు తూట్లు పొడుస్తూ అక్రమార్కులు తవ్వుకుపోతున్నారు. ఇసుకను అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న వారిలో నక్క గణేష్‌తో పాటు పట్నాల కృష్ణ తదితరులు ఉన్నారు. డిమాండ్ తగ్గినా గతంలో ఉన్న పాత పరిచయాలతో నక్క గణేష్ లారీల యజమానులతో మాట్లాడి ఇసుకను విశాఖకు అక్రమంగా తరించుకుపోతున్నాడు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ర్యాంపుల్లో 20 టన్నుల లారీకి ఇసుకను అనధికారికంగా లోడ్ చేయడానికి రూ.12వేలు వసూలు చేస్తున్నారు. నక్క గణేష్ దీన్ని క్యాష్ చేసుకోవడానికి తన చిన్నాన్న నక్క జగదీష్‌కు చెందిన నీలిమ వేబ్రిడ్జ్‌ను వేదికగా చేసుకొని ఇసుకను స్టాక్ పాయింట్‌గా మార్చేశాడు. జాతీయరహదారికి ఆనుకొని ఉండడం, ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న ర్యాంపుల నుంచి ప్రభుత్వ నిర్మాణాలకు వెళుతున్న ఇసుక వాహనాలు వేబ్రిడ్జ్‌కు వస్తుండడంతో దీన్ని అవకాశంగా మార్చుకున్నాడు. వేబ్రిడ్జ్ వద్ద ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.700కు లోడ్ చేస్తుండడంతో దీన్ని సమీప ప్రాంతాలకు తరలించి విక్రయిస్తే దూరాన్ని బట్టి రూ.1200 నుంచి రూ.2600 వరకు పలుకుతుంది. లారీ రూ.9వేలకు లోడ్ చేస్తే, దీన్ని విశాఖకు తరలిస్తే రూ.25వేల నుంచి రూ.30 వేలకు అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. దీంతో నక్క గణేష్ పాతపరిచయాలను ఉపయోగించి కొత్తగా ఆలోచన చేసి నీలిమ వేబ్రిడ్జ్‌లోనే స్టాక్‌పాయింట్ పెట్టి దర్జాగా ఇసుక వ్యాపారం చేసుకుంటున్నాడు

# దయచేసి ఆ చెట్లు తొలగించండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక పాలకొండ రోడ్డు మధ్యలో డివైడర్ మాదిరిగా వేసిన మోనోకార్పస్ చెట్లు తొలగించాలని నగరవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఆరోగ్యానికి హానికరమని తెలిసినా దీనిపై పాలకులు ఎందుకు ఉదాశీనంగా ఉన్నారో అర్థం కావడంలేదని ప్రశ్నిస్తున్నారు. రోడ్డు మధ్యలో ఏపుగా పెరిగిన ఈ చెట్ల వల్ల నిత్యం ఈ ప్రాంతంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. విద్యుత్ స్తంభాలను కూడా ఈ చెట్లు కప్పేయడంతో కొన్నిచోట్ల వీటిని తొలగించి, మిగిలినవాటిని అలాగే వదిలేశారు. ఏపుగా పెరిగిన కొమ్మలు బలంగా లేకపోవడంతో ఎప్పటికప్పుడు విరిగి విద్యుత్ తీగల మీద పడుతున్నాయి. దీనివల్ల ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు నిరంతరం అంతరాయం కలుగుతుంది. రెండు రోజుల క్రితం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చెట్టుకొమ్మ విరిగి కరెంటు తీగల మీద పడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఎప్పటికప్పుడు చెట్ల కొమ్మలు విరగడం వల్ల విద్యుత్ తీగలు తెగుతున్నాయి. ఇది ఆ రోడ్డు మీద ప్రయాణించేవారి మీద పడితే ప్రాణనష్టం జరుగుతుందని తెలిసినా మున్సిపల్ అధికారులు స్పందించడంలేదు. అచ్చెన్నాయుడు తాజాగా మరోసారి మంత్రయిన తర్వాత కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఈ చెట్లను తొలగించాలని ఆదేశించినా ఇంతవరకు ఆ పనులు చేపట్టలేదు. మరోవైపు న్యూకాలనీ వంటి ప్రాంతాల్లో గతంలో వేసిన మోనోకార్పస్ చెట్లు రోజంతా దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ఈ ప్రాంతంలో ముక్కు మూసుకొని నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే స్థానిక మారుతీ థియేటర్ వద్ద ఉన్న కాస్మోపాలిటన్ క్లబ్ నుంచి జిల్లాపరిషత్ కార్యాలయం వరకు ఈ చెట్ల నుంచి వచ్చిన గాలి పీల్చలేక జనం ఇబ్బందులు పడుతున్నారు. చెట్లు తొలగిస్తే కేసులు పెట్టం అని ఒక హామీ ఇస్తే ప్రజలే వాటి పీడ వదిలించుకోవాలని చూస్తున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం వీటి తొలగింపునకు త్వరలోనే టెండర్లు పిలుస్తామని చెబుతున్నారు. అనేక నిర్మాణ పనులకు ఎటువంటి టెండర్లు లేకుండా కోట్లాది రూపాయలు ఇచ్చేస్తున్న మున్సిపాలిటీ జనాలు గగ్గోలు పెడుతున్నా చెట్లను తొలగించడానికి మాత్రం టెండర్ నిబంధన పాటిస్తుందట!

# భావోద్వేగ వాంతులు విరేచనాలు!

తిన్న అన్నం జీర్ణమయితే మలం. అదే అడ్డమయిన గడ్డి తింటే..? వాంతులు, విరేచనాలు. భావోద్వేగ వాంతులు విరేచనాలు ఏంటో?? కాలికి ముల్లు గుచ్చుకుంటే.. ఎంతటి దాదా, పిస్తా అయినా 'అమ్మా' అంటాడు. జలుబు, దగ్గు వస్తే హీరో అయినా రెండు రోజులు మంచం పడతాడు. కరోనా వస్తే.. మహా మహా హీరోలు మూతికి గోచి పెట్టుకొని బెడ్‌రూమ్స్‌లో తొంగున్నవారే. ఇది రియల్ లైఫ్. మరి రీల్ లైఫ్? ఇది ఇప్పట్లో మొదలయ్యింది కాదు. కానీ.. రాను రాను పట్టపగ్గాలు లేకుండా తయారవుతోంది. కేజీఎఫ్ బ్రాండ్ సినిమాలు లాజిక్ ఉండదు. టన్నుల కొద్దీ హింస. ఒక సీన్‌కు మించి హింస మరో సీన్‌లో. ఒక సినిమాకు మించిన హింస ఇంకో దానిలో. తన్నుడు, కొట్టుడు.. అయిపోయింది. నరకుడు, చంపుడు, రక్తం ఏరులై పారుడు.. అదీ గ్రాఫిక్ వయోలెన్స్ హింసోన్మాదం. ఓవర్ ఆక్షన్ టు ది పవర్ ఆఫ్ ఓవర్ ఆక్షన్. హింస.. భాషాగోడల్ని తొలగించింది. ఆల్ ఇండియా సరుకు అయ్యింది. సౌత్ హీరోలంటే బాలీవుడ్ వారికి చిన్నచూపు. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు హింస ద్వారా దక్షిణ సినిమాలకు ఆల్ ఇండియా మార్కెట్ వస్తోంది. కోట్లు కురుస్తున్నాయి. కనక వర్షం కురుస్తుంటే నిర్మాతలు, దర్శకులు, హీరోలు ఊరుకుంటారా? వారిని తప్పుపట్టి లాభం లేదు. జనాల్లో ఇంత హింసోన్మాదం పెరిగిపోవడానికి కారణాలేంటి? దీని పర్యవసానాలు ఎలా ఉంటాయి? ఒక్కరంటే ఒక్కరు.. మీడియా కానీ, మేధావులు కాని దీనిపై దృష్టి సారించలేదు. ఇదిగో మీ కోసం విశ్లేషణ.. ప్రమాద ఘంటికలు. గ్రీకు భాషలో కేథరిసిస్ అనే పదం ఉంది. ఒక వ్యక్తిలో విపరీతమైన భావోద్వేగం పేరుకొనిపోతే? అది ఒక్కసారిగా కొన్ని రూపాల్లో బయటకు వస్తుంది. అందరికీ అర్థం అయ్యేందుకు నేను దాన్ని ఎమోషనల్ వాంతి, ఎమోషనల్ విరేచనం అని తర్జుమా చేశాను. ఇది ఇప్పుడు మొదలయ్యింది కాదు.

మీరు గమనించారా? గ్రామాల్లో ఒక స్త్రీకి దెయ్యం పూనుతుంది. ఆమె అరగంట పాటు అరుస్తుంది, శాపనార్థాలు పెడుతుంది. ఇది కేథరిసిస్. దగ్గరి వారు చనిపోయినప్పుడు తమిళనాట స్త్రీలు పాడి పాడి ఏడుస్తారు. తమ కష్టాల్ని బాధల్ని చెప్పుకొంటారు. ఇది కూడా భావోద్వేగ విరేచనమే. పాత రోజుల్లో సినిమా థియేటర్‌లో కూర్చొని భావోద్వేగ సీన్స్ చూసి ఏడ్చేసేవారు. ఇవన్నీ కేథరిసిస్‌లే. కానీ ఇప్పుడు కాలం మారింది బ్రో. మానవ జాతి చరిత్రను రెండు భాగాలుగా విభజించొచ్చు. స్మార్ట్‌ఫోన్ ముందు దశ. స్మార్ట్ ఫోన్ వచ్చిన తర్వాత మొదలైన.. జంబ లకడి పంబ దశ.

2010- స్మార్ట్ ఫోన్ వచ్చింది. 2014 - చీప్ డేటా ప్లాన్ వచ్చింది. 2020- కరోనా కాలంలో అది పిల్లల చేతికి కూడా వెళ్లిపోయింది. కేవలం స్మార్ట్ ఫోన్ కాదు.. ల్యాప్‌టాప్.. టాబ్స్.. స్మార్ట్ టీవీ. అప్పటిదాక ఉన్న వినోదం వేరు. ఇప్పుడు.. వినోద గంజాయి ఒక పెగ్గుకు అలవాటు పడినోడికి.. రెండు వేస్తె కానీ కిక్కు ఎక్కదు. ఆరు నెలలకు క్వార్టర్ బాటిల్.. అటుపై ఏడాదికి ఫుల్ బాటిల్. రెండేళ్లు గడిస్తే పరగడుపునే తాగితే కాని వాడు నిలువలేడు. తాగి పడిపోతాడు. తాగకపోయినా పడిపోతాడు. వాడు పడిపోవడం కాదు.. కుటుంబాన్ని పడేస్తాడు.. సమాజన్ని కూడా పడేస్తాడు. హింస, సెక్స్ కూడా ఇలాంటిదే. 'నా పార్టీ, నా పార్టీయో' అని జనాలు కొట్టుకోవడమే కానీ ఏ పార్టీ అయినా అంతే. ప్రభుత్వాలు సెన్సార్‌ను పడుకోబెట్టేశాయి. లాక్‌లు ఎత్తేసాయి. దీనితో మితిమీరిన హింస సెక్స్‌తో సినిమాలు. మన సినిమా హిట్ కావాలంటే.. అంతకు మించి డోస్ ఇవ్వాలి అని ప్రతోడు తయారవుతున్నాడు. ఇందాకే చెప్పినట్టు... వారిని అని ప్రయోజనం లేదు. వారు అల్పప్రాణులు. దే ఆర్ స్మాల్ పీపుల్.

**ఏమి జరుగుతోంది?**

1. విపరీతమయిన హింసను చూసినప్పుడు మనిషి సున్నితత్వాన్ని కోల్పోతాడు. మరింత హింసను, అదీ డిటైల్డ్‌గా చూపాలని కోరుకుంటారు. ఛాతి ఎముకలు పెళపెళవిరిగినట్టు, కపాలం పెద్ద శబ్దంతో పేలినట్టు, తొడ ఎముక డమ్ అని పేలినట్టు, రక్తం సర్రున వుబికినట్టు క్లోజ్ అప్‌లో పదేపదే చూపడం.. దీన్నే గ్రాఫిక్ వయోలెన్స్ అంటారు.

2. హింస అంటే బాధ. ఇదంటే భయం ప్రతి మనిషిలో ఉంటుంది. కానీ పదే పదే ఇలాంటి సన్నివేశాల్ని చూసినప్పుడు హింసంటే ఇష్టం ఏర్పడుతుంది. పదే పదే దాన్నే చూడాలి అనుకొంటారు. ఇలాంటి సన్నివేశాల్ని చూసినప్పుడు వారి మెదడు ఆడ్రినాలిన్‌ను విడుదల చేస్తుంది. అప్పుడు వారికి సమ్మట్టి ఫీలింగు వస్తుంది. ఫుల్ బాటిల్ కొట్టినా.. చాటాకు గంజాయి కొట్టినా రాని కిక్కు. కిక్కే కిక్కు.

3. ఆ కిక్కు కోసం జనాలు ఏమైనా చేస్తారు. అంత హింస ఎందుకు? అనే లాజిక్ వారికి అక్కరలేదు. క్రిటికల్ థింకింగ్ రీసోనింగ్ స్కిల్స్ చచ్చిపోతాయి. విచక్షణ, ఇంగిత జ్ఞానం మరిచిన వాడు ఉన్మాది అవుతాడు. మధ్యప్రాచ్య దేశాల్లో టెర్రరిస్ట్ క్యాంప్స్‌లో హింసాత్మక వీడియోస్ చూపి పిరికివాడిని కూడా ఉన్మాదిగా మార్చేస్తారు. ఇప్పుడు భారతదేశం మొత్తం ఒక టెర్రరిస్ట్ ట్రైనింగ్ క్యాంపు అయిపోయింది. విచక్షణ మరచిన ఉన్మాదుల్ని తయారుచేస్తూ మనం భుజాలు ఎగరేసుకొంటున్నాము.

**'లక్కీ భాస్కర్'లా సంపాదించాలని..**

- హాస్టల్ నుంచి నలుగురు విద్యార్థులు జంప్
- ఫీజు డబ్బులతో విశాఖ నుంచి విజయవాడకు
- గుర్తించి వెనక్కు తీసుకొచ్చిన పోలీసులు

విశాఖపట్నం/మహారాణిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నలుగురు విద్యార్థులు 'లక్కీ భాస్కర్' సినిమా హీరోలా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని హాస్టల్ నుంచి పారిపోయారు. విశాఖలోని మహారాణిపేటలో ఉన్న సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎన్.కిరణ్‌కుమార్, పి.కార్తీక్, బి.చరణ్‌తేజ, జి.రఘు... హాస్టల్‌లో ఉంటున్నారు. ఈ నెల 8వ తేదీన వారు లక్కీ భాస్కర్ సినిమా చూశారు. అప్పటి నుంచి వారికి ఆ హీరోలా డబ్బు సంపాదించి కారు, బంగ్లా కొనాలనే కోరిక పెరిగింది. ఇదే విషయాన్ని హాస్టల్‌లోని మిత్రులకు చెప్పారు. తాము బయటకు వెళ్లిపోతామని, డబ్బు సంపాదించాకే తిరిగి వస్తామన్నారు. సోమవారం తెల్లవారుజామున హాస్టల్ గోడ దూకి బయటకు వచ్చారు. ఫీజు కట్టేందుకు తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బుతో విజయవాడ వెళ్లారు. విద్యార్థులు అదృశ్యమైన సంగతి గుర్తించిన హాస్టల్ యాజమాన్యం మహారాణిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు పిల్లల ఫొటోలతో సమాచారాన్ని రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించారు. విజయవాడ చేరిన విద్యార్థులు మొగల్రాజపురం ఏరియాలో బ్యాగులతో తిరుగుతుండగా అక్కడి పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తీసుకువెళ్లారు. మహారాణిపేట పోలీసులు మంగళవారం అక్కడకు వెళ్లి వారిని వెనక్కు తీసుకువచ్చారు.

4. ప్రతి ఒక్కడికి నిజ జీవితంలో ఎన్నో సమస్యలు. చదువు, ఉద్యోగం, డబ్బు, సంసారం, నిజజీవిత సమస్యల్ని మర్చిపోవడానికి ఈ కిక్కు ఉపకరిస్తుంది. డ్రగ్స్ తీసుకొన్న హిప్పీ లాగే వీరు ఆనంద డోలికల్లో ఊగులాడుతారు.

5. ఇది మానసిక రోగుల్ని తయారుచేస్తుంది. అడ్రినాలిన్ రష్ అయిపోయాక స్ట్రెస్, వ్యాకులత వస్తాయి. అటుపై గ్లూకో కార్టికాయిడ్, కార్టిసాల్ వస్తుందిట. ఆ మాటకొస్తే ఆడ్రెనాలిన్ కూడా ఇదే బాపతు. దీనివల్ల ఊబకాయం, డయాబెటిస్, గుండెవ్యాధులు, బొల్లి చర్మం, థైరాయిడ్ సమస్యలు, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం. ఫార్మసురులకు పండగే పండగ.

6. ఇది యువతను ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. వారు మరింత కిక్కు కోరుకొంటారు. రానున్న రోజుల్లో ప్రతి ఇంట్లో మానసిక శారీరక రోగుల జాతర. మీ ఇంటి బిడ్డను రక్షించుకోండి. మీరు హింసాత్మక సినిమాలు చూడొద్దు. ఎద్దు, ఆవు చేలో మేస్తే.. దూడలు గట్టుపై మేస్తాయా? పిచ్చి పేరెంట్స్.. మీ బిడ్డ హింసాత్మక సినిమాలు చూడాలంటే తొడపాశం పెట్టండి. కెవ్వుమని అరుస్తారు. చిన్న తొడపాశానికే ఇంత నొప్పి ఉంటే.. అంతలా కొడితే, నరికితే ఎలా? అని చెప్పి వారిలో సహానుభూతి, మానవీయ విలువలు పెంపొందించండి.

- వాసిరెడ్డి అమర్నాథ్

## సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ-ఏ కాలనీలో ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. నగర పరిధిలోని అన్ని డివిజనల్ నుంచి ప్రజలు వచ్చి డ్రైన్లు, రోడ్లు నిర్మించాలని కోరుతూ వినతులు అందుతున్నాయన్నారు. పింఛను అందించాలని, రేషన్‌కార్డులు కావాలని దరఖాస్తులు అందుతున్నాయని, ఆయా సమస్యలపై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచిస్తున్నట్టు వివరించారు. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి ప్రదాత చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు నమ్మి కూటమికి అధికారం అందించారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సుపరిపాలన అందజేసి ప్రజల మన్ననలు అందుకుంటామని చెప్పారు.

## పసగాడ సూర్యనారాయణ ట్రస్ట్ అన్నదానం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని పీఎస్ఎన్ఎం హైస్కూల్ వద్ద గురువారం పసగాడ సూర్యనారాయణ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. 110 మందికి మధ్యాహ్న ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండర్ పసగాడ సూర్యనారాయణ(జూనియర్) ట్రస్ట్ సభ్యులు పిఎస్‌జే ప్రసాదరావు, పి.రవీంద్రనాథ్, పి.రామక్రిష్ణ, కోశాధికారి బి.సుధాకర్‌రావు, ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.